

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

● బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ సునీల్ షెరాన్



బాధ్యతలు తీసుకుంటున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్ సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. నంద్యాల ఎస్పీగా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని జిల్లా పోలీ సు కార్యాలయంలో సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి అనంతరం వేద పండితుల మధ్య ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నుంచి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు పోలీసుల వద్దకు వస్తే న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కల్పిస్తామన్నారు. పోలీసులు కూడా ప్రజలతో సఖ్యతగా మెలగాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని, లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జిల్లా యంత్రాంగం పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు యుగంధర్‌బాబు, జావళి, ఆత్మకూరు, ఆళ్లగడ్డ డీఎస్పీలు రామాంజి నాయక్, ప్రమోద్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

ప్యాపిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం పట్టణానికి రానున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి మహేశ్ తెలిపారు. ఆయన టమోటా మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు జిల్లా సీపీఐ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నట్లు చెప్పారు. రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. అర్జీదారులు నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని, పరిష్కారం ఏ దశలో ఉందో కూడా తెలుసుకోవచ్చని చెప్పారు. జిల్లా కేంద్రంలో జరిగే పీజీఆర్ఎస్ కు ఉదయం 9.30గంటలకు అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

పోటెత్తిన భక్తులు

పాతాళగంగలో పుణ్యస్నానాలు



శ్రీశైలంలో క్యూలో వెళ్తున్న భక్తులు

శ్రీశైలం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అష్టదశ శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఆది వారం క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. మల్లన్న దర్శనం కోసం గంటల తరబడి భక్తులు నిలబడ్డారు. రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసి పోయాయి. శ్రీశైలంకు చేరుకున్న వారు ముందుగా పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించారు. మొక్కులు తీర్చుకొని తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో శ్రీనివాస రావు అన్ని ఏర్పాట్లు చేశారు.



ఎందుకింత గోప్యత..?

● 90 ట్యాబ్‌లను ఎత్తుకెళ్లిన దొంగలు
● విషయాన్ని దాచిపెట్టిన విద్యా శాఖాధికారులు
● చోరీ జరిగిన వారం రోజులకు ఫిర్యాదు
● పోలీసుల అదుపులో నిందితులు?

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యాశాఖ, సమగ్రశిక్షలో ట్యాబ్‌లు మాయమయ్యాయి. పీఎంశ్రీ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలల విద్యార్థులకు అందజేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్యాబ్‌లను అందజేసింది. ట్యాబ్‌లు మాయమైన విషయాన్ని గోప్యంగా ఉంచారు. పట్టణ నడిబొడ్డున ఉన్న మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలోని ఉపవిద్యాశా ఖాధికారి కార్యాలయంలో ఖాళీగా ఉన్న గదిలో రూ.13లక్షల విలువైన 90ట్యాబ్‌లను భద్రపరిచారు. వాటికి ఒక అధికారిని కూడా నియమించారు. 10 రోజుల క్రితం ట్యాబ్‌లు చోరీకి గురైనా విద్యాశాఖ అధికారులు కనీసం పోలీసులకు ఫిర్యాదు చేయకుండా, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లకుండా గుట్టుచప్పుడు కాకుండా వ్యవహరించారు.

జిల్లాలో విద్యా శాఖాధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమే ఈ ఘటన.. ఉపాధ్యాయ దినోత్సవంపై ఉన్న మక్కువ ఆ శాఖ అధికారులు, సిబ్బందికి విధులపై లేదు. ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో తలుపులు, తాళాలను పగులగొట్టి దొంగలు లోపలికెళ్లారు. ఓ గదిలో భద్రపరిచిన ట్యాబ్‌లు ఎత్తుకెళ్లారు. అయినా కూడా వారు స్పందించడం లేదు. చోరీ జరిగిన వారం రోజుల తర్వాత నిద్ర మత్తు వీడారు. గదిని తెరిచి చూస్తే ట్యాబ్‌లు మాయమయ్యాయి. విషయాన్ని ఆ శాఖాధికారులు డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. అయినా మరింత గోప్యత పాటించారు. ఆలస్యంగా వెళ్లి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేయలేదు. ఈ విషయమై పోలీసులు, విద్యా శాఖాధికారుల మధ్య వాదన సాగింది. ఎట్టకేలకు ఓ ప్రజాప్రతినిధి జోక్యంతో కేసు నమోదు చేశారు.

పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై..

ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో తలుపులు, తాళాలను పగులగొట్టి దొంగలు లోపలికెళ్లారు. యథేచ్ఛగా అన్ని గదుల్లో తిరిగారు. ఒక గదిలో ట్యాబ్‌లు ఉండటాన్ని గుర్తించి 90 ట్యాబ్‌లను ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు కార్యాలయానికి వెళ్లిన అధికారులు, సిబ్బంది తలుపులు పగలగొట్టి ఉండం చూశారు. కానీ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఉపాధ్యాయ దినోత్సవంలో బిజీగా ఉన్న అధికారులు ఆవిషయాన్ని పక్కన పెట్టారు. తాపీగా మూడు రోజుల తర్వాత ఆ గదిలో ట్యాబ్ భద్రపరిచిన అధికారి గోదాముకు చేరుకొని ట్యాబ్‌లు చోరీకి గురయ్యాయని గుర్తించి డీఈవో దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. డీఈవో ఈ విషయాన్ని మరింత గోప్యంగా ఉంచారు. కనీసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లలేదని తెలిసింది.

కలెక్టర్ సీరియస్

ట్యాబ్‌ల చోరీ విషయం కలెక్టర్ రాజకుమారి దృష్టికి తీసుకెళ్లడం ఆలస్యం చేయడంతో డీఈవో నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్ అయినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా ఏం చర్యలు తీసుకున్నారని మండిపడినట్లు విద్యాశాఖలో చర్చ జరుగుతోంది.

సుమారు 70 ట్యాబ్‌లు స్వాధీనం?

ట్యాబ్‌ల చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులకు ముగ్గురు మైనర్లు చోరీకి పాల్పడినట్లు గుర్తించినట్లు సమాచారం. వారి వద్ద నుంచి సుమారు 70 ట్యాబ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మిగిలిన ట్యాబ్‌లపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిసింది. కర్నూలు విద్యాశాఖ కార్యాలయంలోనే ఎక్కువ సమయం కేటాయిస్తున్న డీఈవో ట్యాబ్‌ల చోరీ విషయంపై వివరణ కోరేందుకు ప్రయత్నిస్తుండగా ఆయన స్పందించడం లేదు.

అధికారుల తీరును తప్పుబట్టిన పోలీసులు

ట్యాబ్‌లు చోరీ సంఘటనపై ఆలస్యంగా వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి పరిశీలించే లోపే దొంగలు పగులగొట్టిన తలుపులను, ఇతరత్రా వాటిని కార్పెంటర్‌తో మరమ్మతులు చేయించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విద్యాశాఖ అధికారుల తీరును తప్పుబడుతూ ఆగ్రహం వ్యక్త చేశారు. దర్యాప్తులో ఉండగానే మీరెలా మరమ్మతులు చేయిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెనుదిరిగినట్లు తెలిసింది. అత్యంత విలువైన ఫైల్స్ ఉన్న కార్యాలయాల్లో ఒక్క సీసీ కెమరా లేకపోవడంపై పోలీసులు విస్తుపోయి ఇంతటి నిర్లక్ష్యమా అంటూ తాము కేసు నమోదు చేయలేమని అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. పోలీసులు, విద్యాశాఖ అధికారుల మధ్య వాదోపవాదాలు జరిగిన సంఘటన మంత్రి ఎన్ఎండీ ఫరూక్ దృష్టికి చేరడంతో వారి జోక్యంతో ఎట్టకేలకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాబ్‌లు చోరీకి గురయ్యాయి

ట్యాబ్‌లు చోరీకి గురైన సంఘటన వాస్తవమే. కాస్త ఆలస్యంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాం. కార్యాలయంలో అన్నింటా సోదా చేశారు కానీ ఏమి పోలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. పక్కనే ఉన్న గది తమది కాదు. అందులో ట్యాబ్‌లను భద్రపరిచారు. మూడురోజుల తర్వాత సంబంధిత విభాగం అధికారి చూసుకున్నప్పుడు ట్యాబ్‌లు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాం.

● శంకర్‌ప్రసాద్, డిప్యూటీ డీఈవో

గోదాములో కుళ్లిపోయిన ఉల్లి

● క్వింటా రూ.30లకే విక్రయం
● నాణ్యమైన ఉల్లి రూ.900లకు అమ్మకం



కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల నుంచి మార్క్‌ఫెడ్ అధికారులు క్వింటం రూ.1,200లకు కొను గోలు చేసి గోదాములో నిల్వ ఉంచి ఉల్లి కుళ్లిపోతోంది. ఆదివారం దెబ్బతిన్న ఉల్లిని కిలో 4 పైసలు అంటే క్వింటం ఉల్లిని రూ.30లకే అమ్మేశారు. దాదాపు వారం పది రోజులుగా ఉల్లిని గోదాములోనే నిల్వ చేయడంతో చాలా వరకు ఉల్లి డ్యామేజీ అయింది. ఈ ఉల్లిని ఎలాగైనా మార్కెట్ యార్డు నుంచి బయటకు తరలించాలనే ఉద్దేశ్యంతో మార్క్‌ఫెడ్ అధికారులు వేలం పాట నిర్వహిస్తున్నారు. శనివారం 800 మెట్రిక్ టన్నుల ఉల్లిని క్వింటా ఉల్లిని రూ.50ల నుంచి రూ.800ల వరకు అమ్మారు. ఆదివారం ఈ ధర మరింతగా దిగజారింది. కేవలం రూ.30లకే క్వింటం ఉల్లిని అమ్మేశారు. నాణ్యత గలిగిన ఉల్లిని రూ.900లకు అమ్మేశారు. ఈరోజు 700 మెట్రిక్ టన్నుల ఉల్లిని విక్రయించామని, జేసీ బి.నవ్య ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించామని మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. మార్కెట్ యార్డు సెక్రటరీ జయలక్ష్మి, మేనేజర్ రాజు విలేకరులతో మాట్లాడుతూ సోమవారం యార్డుకు రైతులు పెద్ద ఎత్తున ఉల్లి గడ్డలు తీసుకువచ్చే అవకాశం ఉంటుందని, అందువల్ల మంగళవారం యార్డులో ఉల్లిగడ్డల క్రయ విక్రయాలు జరగవని తెలిపారు. కర్నూలు మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లు రైతులతో పెద్దఎత్తున నాణ్యతతో లేని ఉల్లిగడ్డలను తెప్పిస్తున్నట్లు జేసీ గుర్తించారని, అలా చేస్తే కమీషన్ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమీషన్ ఏజెంట్లు ప్రతి షాపుకు కేవలం 400 బస్తాలకు మించి మార్కెట్ యారుకు తీసుకురాకుండా రైతులకు నచ్చజెప్పాలని సూచించారు. అలా కాకుండా అధిక మొత్తంలో తెప్పించిన కమీషన్ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అమ్మకానికి ఉల్లిగడ్డలను యార్డుకు తెచ్చేటప్పుడు గ్రామంలోనే ఆరబెట్టి గ్రేడింగ్ చేసి ఎటువంటి మురుగులు లేకుండా నాణ్యమైన ఉల్లిగడ్డలను తీసుకురావాలన్నారు. తమ వెంట తప్పనిసరిగా ఈ-పంట నమోదు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకం, బ్యాంకు అకౌంటు బుక్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీశైలానికి తగ్గిన వరద

● ఐదు గేట్లతో నీటి విడుదల ● నీటినిల్వ సామర్థ్యం 208 టీఎంసీలు



ఐదు గేట్లతో కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయానికి వరద తగ్గింది. ఆదివారం రాత్రి 7గంటల సమయానికి ఐదు గేట్ల గుండా 1,37,390 క్యూసెక్కులు సాగర్‌కు విడుదల చేశారు. డ్యాం నీటిమట్టం 883 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 208 టీఎంసీలుగా నమోదైంది. ఎగువ జూరాల స్పిల్‌వే, సుంకేసుల నుంచి 1,28,949 క్యూసెక్కులు శ్రీశైలం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరాయి. శ్రీశైలం రెండు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి అనంతరం జెన్‌కో అధికారులు 65,930 క్యూసెక్కులు విడుదల చేశారు. శ్రీశైలం డ్యాంకు వరద ప్రవాహం తగ్గేకొద్ది గేట్ల సంఖ్యను ఇంజనీర్లు తగ్గిస్తున్నారు. గడచిన ఇరవై నాలుగు గంటల్లో రెండు విద్యుత్ కేంద్రాల్లో 32.008మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

జర్నలిస్టులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

● శిక్షణ తరగతులు అభినందనీయం
● కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు
● ముగిసిన సీఆర్ మీడియా అకాడమీ శిక్షణ

7లో



డీఐపీఆర్వోగా మల్లికార్జునయ్య బాధ్యతలు



నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా మల్లికార్జునయ్య ఆదివారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. డీఐపీఆర్వో మాట్లాడుతూ కలెక్టర్ రాజకుమారి సల హాలు, సూచన లు పాటిస్తూ శాఖాపరంగా జర్నలిస్టుల సం క్షేమానికి కృషి చేస్తాన న్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, అధికారిక కార్యక్ర మాలను మీడియా ద్వారా మరింత విస్తృ తం చేస్తామన్నారు. కార్యాలయంలో అంద రూ కలిసికట్టుగా, బాధ్యతగా పనిచేద్దామని పిలుపనిచ్చారు. నూతన డీఐపీఆర్వోకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రూ.400కోట్లతో అభివృద్ధి పనులు

● ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ
● మహానందిలోని టూరిజం వసతి గృహాల పరిశీలన



మహానంది, సెప్టెంబరు 14 ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏపీ టూరిజం పరిధిలోని రెస్టారెంట్లు, వసతి గృహాల్లో రూ.400కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. ఆదివారం మహానందిలోని ఏపీ టూరిజం వసతిగృహాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలోని సింహాచలం, అన్నవరం, శ్రీశైలం, అహోబిలం, గండి ఆంజనేయ దేవాలయాల పరిధిలోని టూరిజం వసతిగృహాలను పూర్తిగా ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.40 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. దీనికి తగ్గట్టుగానే పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అహోబిలంలోని వసతి గృహాల పర్నిచర్ కోసం అదనంగా రూ.75లక్షలు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని టూరిజం రెస్టారెంట్లను కేవలం లీజ్ పద్ధతిన ఇవ్వడానికి మాత్రమే టెండర్లను పిలుస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కూడా ఉద్యోగ భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. మహానందిలోని హరిత వసతిగృహంకు ప్రహరీ నిర్మాణంతో పాటు గదుల ఆధునీకరణ అంశంపై బోర్డు సమావేశంలో చర్చించి, నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో టూరిజం ఉమ్మడి కర్నూలు జిల్లా ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు, మహానంది టూరిజం మేనేజర్ సత్యారావు పాల్గొన్నారు.



ప్రజల గొంతుకే బలం

● స్వేచ్ఛాయుత ప్రజాతీర్పుతోనే నిజమైన ప్రజాస్వామ్యం
● నేడు అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం

ఆత్మకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛాయుతమైన ప్రజాతీర్పే నిజమైన ప్రజాస్వామ్యానికి నాందిగా నిలుస్తుంది. అయితే నానాటికి రాజకీయ విలువలు క్షీణిస్తూ.. ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారుతోంది. వాస్తవానికి ప్రజాస్వామ్యం అనేది ఒక రాజకీయ భావన లేదా ప్రభుత్వ ఏర్పాటు విధానంగా చెప్పవచ్చు. ఇందులో ప్రజల నిర్ణయాధికారాలే కీలకం. నేటికి ప్రపంచంలోని అనేక దేశాల్లో రాచరిక, కులీన వ్యవస్థలు కొనసాగుతున్నప్పటికీ మనదేశంలో మాత్రం ప్రజాస్వామ్య వ్యవస్థ పరిడవిల్లుతోంది. అందుకే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా భారత్ ఈ గుర్తింపు దక్కించుకుంది. అయితే మనదేశంలో ప్రజాస్వామ్య రెండు రకాలుగా అమలవుతోంది. అవి ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామ్య వ్యవస్థలుగా ఉన్నాయి. 1951-52లో నుంచి మనదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ అమలై తొలిసారిగా సాధారణ ఎన్నికలు జరిగాయి. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1973లో దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించారు. అయితే ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం హక్కులను కల్పించే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రజల్ని ప్రలోభాలకు గురిచేసేందుకు చేస్తున్న స్వార్థపూరిత విధానాలు ప్రజాస్వామ్య వ్యవస్థకే తూట్లు పడేలా చేస్తున్నాయి. ప్రజాస్వామ్య విలువలను, ప్రయోజనాలను పౌరులందరికి తెలియపర్చేందుకు ప్రతిఏటా సెప్టెంబరు 15వ తేదిన అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఎప్పుడు మొదలైందంటే..



ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో 2007లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ప్రతిఏటా సెప్టెంబరు 15న అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానించింది. ఆ తర్వాత 2008 సెప్టెంబరు 15వ తేదిన తొలిసారిగా అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రతిఏటా విద్యార్థులకు వర్క్‌షాప్‌లు, డిబేట్స్, పౌర సమాజ సంస్థలతో సమావేశాలు తదితర కార్యక్రమాలను నిర్వహించాలని నిర్దేశించింది. అదేక్రమంలో ప్రతిఏటా ఒక నినాదంతో ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది లింగ సమానత్వాన్ని సాధించడం, చర్య ద్వారా చర్య అనే నినాదాన్ని ఎంపిక చేశారు.

మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఇలా..

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా పేరుగాంచిన మనదేశంలో ప్రత్యక్ష, పరోక్ష ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ కొనసాగుతోంది. ప్రత్యేకించి ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానంలో ప్రజలందరూ భాగస్వాములుగా ఉంటారు. స్థానిక సంస్థల మొదలుకొని చట్టసభల వరకు ప్రాతినిథ్యం వహించే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రజలే నేరుగా ఎన్నుకునే అధికారం ఉంటుంది. ఇందులో ప్రజలే ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. పరోక్ష ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారా విధాన పరిషత్ పాటు రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, గవర్నర్, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీ, జిల్లా పరిషత్ చైర్మన్, కార్పొరేషన్, మున్సిపల్ చైర్మన్‌లు, ఎంపీపీలతో పాటు పలు నామినేటెడ్ పదవుల నియామకం పరోక్ష ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియ కూడా ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల ద్వారా ఎన్నుకుంటారు.

ప్రజలు ప్రలోభాలకు గురికాకూడదు



ఓటు అనే వజ్రాయుధంతో ప్రజాప్రతినిధుల్ని ఎన్నుకునే అధికారం ప్రజలకు ఇవ్వడం శుభపరిణామం. ప్రజలు కూడా అభ్యర్థుల ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిజాయితీతో ఓటు హక్కును వినియోగించుకోవాలి. దీంతో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించి ప్రజలకు మెరుగైన పాలన అందించే ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం వుంటుంది.

● వెంకటేశ్, ఉపాధ్యాయుడు, ఎంపీపీ పాఠశాల, కొట్టాల చెరువు, ఆత్మకూరు మండలం.

ప్రజల్లో చైతన్యం రావాలి



ప్రజాస్వామ్య వ్యవస్థ కులమతాలకు అతీతంగా కొనసాగడం దేశానికి శ్రేయస్కరం. అలాంటప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. తద్వారా ప్రజాస్వామ్య పరిడవిల్లేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం వుంది.

● అమీర్ అహ్మద్, ఎంపీపీ పాఠశాల, కొట్టాల చెరువు, ఆత్మకూరు మండలం

ఒరిస్సా టు పంచలింగాల

● గుట్టుగా గంజాయి రవాణా
● కర్నూలులో 20మందికి పైగా ఏజెంట్లు
● పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

కర్నూలు క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా నుంచి కర్నూలు జిల్లా పంచలింగాల కేంద్రానికి గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సరఫరా అవుతోంది. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు విక్రయిస్తున్న ముఠాను నా లుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సినీ ఫక్కీలో నిందితులు గంజాయిని కారు డోర్‌లో ఉంచి తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. పంచలింగాల చెందిన నరేంద్ర, హరీఫ్, మృత్యుంజ యరెడ్డి, ఉమేష్ చంద్రలతో పాటు మరో యువకున్ని అదుపులోకి తీసుకు న్నారు. పోలీసులు విచారిస్తే ఎన్నో ఆశ్యర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఎన్నో ప్లాన్లు రూపొందించుకుని..

పంచలింగాలకు చెందిన నరేంద్ర అనే వ్యక్తి ప్రధాన నిందితుడుగా గుర్తించారు. అతడు ఎవరికీ అనుమానం రాకుండా ఎన్నో ప్లాన్లు రూపొందిం చుకుని గంజాయి సరఫరా చేస్తున్నట్లు నిర్ధారణలో తేలింది. ముందుగా ఒరిస్సా అరుకు వ్యాలీ తదితర ప్రాంతాలకు టూర్‌కు వెళ్లినట్లు వెళ్తాడు. ఓకారు అద్దెకు తీసుకుని నలుగురి స్నేహితులను ఎక్కించు కుని వారికి అన్ని వసతులు తానే సమకూర్చి తీసుకెళ్లాడు. అక్క డ ఓ మూడు నాలుగు రోజుల పాటు టూర్ ఎంజాయ్‌చేసి వస్తూ వస్తూ గంజాయిని తీసుకువ స్తాడు. పంచలింగాల వచ్చిన తర్వాత వాటిని సిగరెట్లలో నింపి విక్రయి స్తాడు. ఇవి విక్రయించేందుకు కర్నూలులో 20మంది ఏజెంట్లను నియ మించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల విచారణలో ఓ ఏడు మంది పేర్లు వెల్లడించినట్లు తెలిసింది.

కారు డోరుకు హ్యాండిల్..

సినిమా ఫక్కీలో గంజాయిని కారు డోరుకు హ్యాండిల్ ప్లాస్టిక్ సీటుకు మధ్యలో స్క్రూలు విప్పి అందులో గంజాయిని నింపి తిరిగి స్క్రూలు బిగిం చి ఎంచక్కా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఒకవేళ పోలీసులు తనిఖీలు చేస్తే టూర్ వెళ్తునానమని చెబుతారు. కారు తనిఖీ చేసినా పెద్దగా కనిపించదు. ఇలా నెలలో మూడు నాలుగుసార్లు వివిధ కార్లను తీసుకెళ్తూ.. స్నేహితు లను మారుస్తూ ఈ గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. మిగతా విషయాలు సోమవారం వెల్లడించే అవకాశం ఉంది. ప ట్టుబడిన నిందితులో ఒకరి తండ్రి నంద్యాల జిల్లాలో ఏఆర్ హెడ్ కానిస్టేబు ల్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం

మెట్లపై నుంచి పడి వృద్ధురాలి మృతి

మంత్రాలయం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రామ చంద్రనగర్‌లో మెట్లపై నుంచి కింద పడి లక్ష్మీదేవమ్మ (75) మృతి చెందారు. ఆదివారం సాయంత్రం తన ఇంటి మెట్లు దిగుతుండగా.. కాలు అదుపు తప్పడంతో తలకు రక్తగాయమైంది. గమనించిన ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించేలోపే మృతి చెందారు. మృతురాలు గత పదిహేనేళ్ల కింద మంత్రాలయం విద్యుత్ శాఖలో స్వీపర్‌గా పని చేస్తూ రిటైర్డు అయ్యారు.

వ్యక్తికి రిమాండ్

దేవనకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కన్న కొడుకును చంపిన కేసులో నిందితుడు దేవనకొండకి చెందిన నరేష్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు. బాలుడిని డ్రమ్ములో ముంచి హత్య చేసి, భార్యపై తీవ్రంగా దాడిచేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఆదివారం మధ్యాహ్నం వెలమకూరు బస్టాప్ సమీపంలో నిందుతుడిని అరెస్టు చేసి, పత్తికొండ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరచగా, న్యాయాధికారి 15 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

సునిశిత భావాలతో కవిత్వం రాయడం అరుదు

● కళారత్న, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య
● కొత్తకోట శ్రీనివాసరెడ్డి రచించిన 'పుంజుతోక' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జి. పుల్లయ్య, పత్తి ఓబులయ్య, రచయిత కొత్తకోట శ్రీనివాసరెడ్డి తదితరులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పనిచేస్తూ సునిశిత భావాలతో కవిత్వం రాయడం అరుదైన విషయమని, నేడు అది ఒక్క శ్రీనివాసరెడ్డికే సాధ్యపడిందని కళారత్న, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం ఉదయం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొత్తకోట శ్రీనివాసరెడ్డి రాసిన 'పుంజుతోక' కవితా సంపుటి ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సభకు పత్తి ఓబులయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పుస్తక రచయిత కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఉన్నత భావాలు, నైతిక విలువలు కలిగిన పోలీసు అధికారి అని అభినందించారు. శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పీటీవీ సుబ్బయ్య మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి తనకు మిత్రుడని, డిగ్రీ చదివే కాలం నుంచీ ఆయనకు తెలుగు సాహిత్యం పట్ల ప్రత్యేక ఆసక్తి, అభిలాష ఉందని గుర్తు చేశారు. పుస్తక సమీక్ష చేసిన సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, ప్రముఖ రచయితలు డాక్టర్ ఎం.హరికిషన్, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని మాట్లాడుతూ పుంజుతోక కవితా సంపుటిలో మొత్తం 120 కవితలున్నాయని, అవి సులభశైలిలో ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో రాశారన్నారు. పుస్తక రచయిత, విశ్రాంత డీజీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తాను పుట్టిన కర్నూలు జిల్లాలో తన రచన 'పుంజుతోక' కవితా సంపుటి ఆవిష్కరించుకోవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో పుస్తకంలోని పద్యాలను గజల్ గాయకుడు మహమ్మద్‌మియా, రంగస్థల కళాకారుడు కే బాలవెంకటేశ్వర్లు పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సభలో రచయిత తల్లిదండ్రులు, టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి సి. యాగంటీశ్వరప్ప, కోశాధికారి కె. రామస్వామి, సీనియర్ నటులు పి. రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, కేవీ రమణ, సీవీ రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

అలనాటి గురువులకు ఘన సన్మానం



మొలగవల్లిలో గురువులతో 1995-96 పూర్వ విద్యార్థులు

ఆలూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 30 ఏళ్ల తరువాత తమ మిత్రులు, ఉపాధ్యా యులను కలిశారు. తమను గుర్తుంచుకుని సన్మానించడం ఆనందంగా ఉందని ఉపాధ్యాయులు ఆంజనేయులు, ప్రభాకర్‌రావు, హేమలత, ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్, సత్యనారాయణరావు, రేఖ సాగర్, శ్రీరాములు, మదర్ సాబ్, సత్యనారాయణ అన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

నంద్యాల : ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1973-76 బీఎస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ డిప్యూటీ డీఈవో బ్రహ్మానందరెడ్డి వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పూర్వ అధ్యాపకులు రామచంద్రారెడ్డి, రామిరెడ్డి హాజరయ్యారు. పూర్వవిద్యార్థులైన ఏఎస్పీ విల్సన్ గిటారు వాయించగా, ప్రముఖ గాయకుడు ప్రభాకర్ పాటలతో అలరించారు. విశ్రాంత హెచ్‌ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో..

జర్నలిస్టులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

● శిక్షణ తరగతులు అభినందనీయం
● కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు
● ముగిసిన సీఆర్ మీడియా అకాడమీ శిక్షణ



మాట్లాడుతున్న సీఆర్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని మౌర్య ఇన్‌లో గల పరిణయ ఫంక్షన్ హాలులో సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ సహకారంతో రెండు రోజులుగా కొనసాగిన 'గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు' ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలు, సర్టిఫికెట్ల ప్రదానోత్సవానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. అడిషనల్ ఎస్పీ హుస్సేన్‌పీరా మాట్లాడుతూ అకాడమీ చేపట్టిన ఈశిక్షణల ద్వారా గ్రామీణ విలేకర్లు తమ వృత్తిపరంగా మరింత ముందుకు పోయే అవకాశం ఉందన్నారు. ఉదయం సెషన్‌లో గ్రామీణ వార్తలు, కథనాలు కొత్త తరహాలో ఎలా రాయాలో సీనియర్ జర్నలిస్టు డి.సోమసుందర్ తెలియజేశారు. మరో సెషన్‌లో పత్రికా భాషపై సీనియర్ జర్నలిస్టు శంకర నారాయణ భాషాదోషాలు, నిర్ధారణ లేని వార్తలను ప్రచురించడంతో కలిగే నష్టాలను ఆయన పలు ఉదాహరణల ద్వారా తెలియజేశారు. వివిధ సెషన్స్ ద్వారా శిక్షణలు అందించిన వారిని ఎంపీ నాగరాజు, ఏఎస్పీ హుస్సేన్‌పీరా, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, సమాచారశాఖ డీడీ జయమ్మ సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్ మీడియా కార్యదర్శి మణిరాం, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు ఏచూరి శివ, ఐజేయూ సభ్యుడు నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్రకార్యదర్శి కొండప్ప, గౌరవాధ్యక్షులు ఎన్‌వీ సుబ్బయ్య, కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాసగౌడ్, నాయకులు అంజి, శివ ప్రసంగించారు.

భవిష్యత్తులోనూ దశలవారీగా..

సీఆర్ మీడియా అకాడమీ ద్వారా జర్నలిస్టులకు మరిన్ని కార్యక్రమాలను భవిషత్తులోనూ దశలవారీగా నిర్వహిస్తామని సీఆర్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ తెలిపారు. జర్నలిస్టులకు అవసరమైన ఏడు ప్రధాన అంశాలపై రెండు రోజుల పాటూ ఏడు సెషన్స్‌లో నిపుణులతో శిక్షణలు ఇప్పించామని తెలిపారు.

ఫీచర్లను పాఠకులు ఎప్పుడూ ఆదరిస్తారు

సాధారణ వార్తల కన్నా, ఫీచర్లను పాఠకులు ఎప్పుడూ ఆదరిస్తారని, ఆ దిశగా ప్రతి విలేకరి కృషి చేయాలని ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు సూచించారు. పల్లెల్లో జరిగే జాతరలు, తిరునాళ్లు ఇలా ఏదైనా చూసే కోణాన్ని బట్టి కొత్తకొత్త ఫీచర్లు రాసే అవకాశం లభిస్తుందని తెలిపారు.

క్రైం వార్తల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

క్రైం వార్తలు రాజేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు విలేకరులకు అవగాహన కల్పించారు. సీఎం చంద్రబాబుతో చర్చించి అర్హులందరికీ అక్రిడిటేషన్లు, హెల్త్ బీమాలు అమలయ్యేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

గర్భిణి మృతి

● వైద్యుల నిర్లక్ష్యమేనంటున్న బంధువులు
● ఆసుపత్రిపై దాడి.. అద్దాలు ధ్వంసం
● పోలీసుల రంగప్రవేశం



హబీబా(ఫైల్)

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గర్భిణి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె మృతి చెందిందంటూ బంధువులు శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఆసుపత్రిపై దాడికి పాల్పడ్డారు. అద్దాలు ధ్వంసం చేశారు. హస్పిటల్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బంధువులు తెలిపిన వివరాలు.. శిరువెళ్లకు చెందిన జమాల్‌బాషా కూతురు హబీబాకు ఏడాది క్రితం వివాహమైంది. ఆమె మొదటి నుంచి ఓ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటోంది. ఈనెల 12న పురిటి నొప్పులు రావడంతో ఆసుపత్రిలో చేర్చారు. మొదట సాధారణ డెలివరీ చేస్తామని చెప్పిన వైద్యులు తర్వాత అత్యవసరంగా సిజేరియన్ చేసుకోవాలని సూచించారు. దీంతో సిజేరియన్ చేసి బిడ్డను సురక్షితంగా తీశారు. హబీబా అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. దీంతో కోపో ద్రిక్తులైన మృతురాలి బంధువులు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆసుపత్రిపై దాడికి పాల్పడ్డారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మృతురాలి తండ్రి

కార్డియాక్ అరెస్ట్ వల్లనే..

హబీబాకు మొదట సాధారణ డెలివరీ చేస్తామని అనుకున్నాం. రక్తం కూడా 12.3 గ్రాములు ఉంది. అత్యవసర పరిస్థితుల్లో సిజేరియన్ చేశాం. బిడ్డ సురక్షితంగా ఉంది. ఉమ్మినీరు ఊపిరితిత్తుల్లోకి చేరి కార్డియక్ అరెస్ట్ అయి హబీబా మృతి చెంది ఉండవచ్చు.

● డాక్టర్ ఫాతిమా, గైనకాలజిస్ట్



తిరుపతి పట్టణంలో నిర్వహించిన జాతీయ మహిళా సాధికార సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, గౌరు చరిత



నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

మెడికల్ కళాశాల సెక్యూరిటీ సిబ్బంది ఏఐటీయూసీలో చేరిక

నంద్యాల రూరల్ సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది సుమారు 30మంది ఏఐటీయూసీలో చేరారు. ఆదివారం వారు స్థానిక కార్యాలయంలో ఆ యూనియన్ నాయకులు మురళీధర్, శ్రీనివాసులు, సుశీలమ్మ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా నా యకులు మాట్లాడుతూ ఆసుపత్రి సిబ్బందికి జీతాలు పెంచ డానికి, వారిని పర్మినెంట్ చేయడానికి, పీఎఫ్ వంటి సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పట్టించుకోండి

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్

నందికొట్కూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నందికొట్కూరు లో నంద్యాల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశానికి జిల్లా అధ్యక్షుడు జునిత్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్‌ను దూరంచేసే జీవో 77ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, జిల్లా కార్యదర్శి ఆది, జిల్లా నాయకులు జగదీష్, శ్యామ్ నాయక్, సూరి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఏపీటీఎఫ్ కార్యాలయంలో మహానంది మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యుల ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్నికల అధికారిగా, జిల్లా సబ్‌కమిటీ సభ్యులు జీసీ తిమ్మారెడ్డి, జాకీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. అధ్యక్షుడిగా మధు సూదన్, ప్రధాన కార్యదర్శిగా వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజ గోపాల్, మురళీధర్ రెడ్డి, కోటేశ్వరమ్మ, జయసుధ, మల్లికార్జున, కార్యదర్శులుగా మల్లికార్జున రెడ్డి, రామయ్య, అనూష, జాకీర్‌హుస్సేన్, శ్రీవిద్య, జిల్లా కౌన్సెలర్స్‌గా ఎంవీ సుబ్బారెడ్డి, కృష్ణమోహన్, జీసీ తిమ్మారెడ్డి, బాలసంజమ్మ, నాగేశ్వర రావులను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీతో జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ శివయ్య ప్రతిజ్ఞ చేయించారు.

ముమ్మరంగా కార్డన్ సెర్చ్

ఆత్మకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏకల్యానగర్‌లో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూ రు అర్బన్ సీఐ రాము మాట్లాడుతూ.. అనుమానితులు, నేరచరిత్ర కలిగిన వారి నివాసాల్లో తనిఖీలు చేసి 35 బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పుల్లారెడ్డి చెరువుకు పుట్టెడు కష్టాలు

● ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని పనులు
● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

కొత్తపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జి.పుల్లారెడ్డి చెరువు పుట్టెడు కష్టాలతో కొట్టు మిట్టాడుతోంది. ఏళ్లు గడుస్తున్నా చెరువు నిర్మాణం పను లు పూర్తి కాకపోవడంతో ఆయకట్టు రైతాంగం సం బంధిత అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కొత్తపల్లి మండలం గోకవరం గ్రామానికి చెందిన ప్రముఖ నేతి మిఠాయిల వ్యాపారి అంత ర్జాతీయ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు దివంగత జి.పుల్లారెడ్డి తాను జీవించి ఉన్న కాలంలోనే తన స్వగ్రామ రైతులు సాగు, తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గానూ గ్రామ శివారులోని ఎద్దులేరు వాగుపై మెట్టభూములను సస్య శ్యామ లం చేయాలనే ఆశయంతో 2003లో చెరువు నిర్మిం చాలని సంకల్పించారు. జి.పుల్లారెడ్డి మృతి చెంది 18 ఏళ్లయినా ఆయన ఆశయం నెరవేరలేదు. పుల్లారెడ్డి జీవించి ఉన్న సమయంలోనే చెరువు నిర్మాణం కో సం రైతుల నుంచి 350 ఎకరాల భూమిని జి.పుల్లా రెడ్డి ట్రస్టు ద్వారా కొనుగోలు చేసి నష్టపరిహారం సైతం చెల్లించి ప్రభుత్వానికి అప్పగించారు. ఆయన మృతి చెందిన తర్వాత చెరువు నిర్మాణం కోసం మరింత భూమి అవసరం కావడంతో ఆయన సమీ ప బంధువులు పుల్లారెడ్డి ట్రస్టు ద్వారా మరో 64 ఎకరాలు కొనుగోలు చేసి ప్రభుత్వానికి రిజిస్టర్ చేసి ఇచ్చారు. ఎట్టకేలకు పుల్లారెడ్డి సేవలు గుర్తించిన ప్ర భుత్వం చెరువు నిర్మాణం కోసం 2013లో రూ.8.24 కోట్ల నిధులు మంజూరు చేసి నీటి పారుదల శాఖ పర్యవేక్షణలో పనులను గుత్తేదారులకు అప్పగిం చింది. దీంతో 2014 ఫిబ్రవరి 28న అప్పటి న్యాయ శాఖ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి, ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి చేతుల మీదుగా పుల్లారెడ్డి కుమారులు చెరువు నిర్మాణం పూర్తి చేయకుండానే ప్రారంభించారు. అప్పటి నుంచి నేటి వరకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతూ నీటి పారుదల అధికారుల అంచనాల ప్రకారం 70 శాతం పనులు పూర్తయినట్లు చెబుతున్నారు. ఇంకా అలుగు నిర్మాణం పూర్తి స్థాయిలో చేపట్టలేదు.


జి.పుల్లా రెడ్డి చెరువు (ఫైల్)


పుల్లారెడ్డి చెరువు అలుగు


చెరువు కట్టపై ఏపుగా పెరిగిన ముళ్ల కంపలు


చెరువు నిర్మాణం పూర్తికాక ముందే కుంగిపోయిన రాతి కట్టడాలు

చెరువుకు రెండు తూములు ఏర్పాటు చేశారు. చెరువు ఎడ మగట్టు తూము నుంచి 414 ఎకరాలు, కుడిగట్టు తూము ద్వారా 302 ఎకరాలు సాగునీరు అందే విధంగా ఇరిగేషన్ అధికారులు స్థిరీకరించారు. అ యితే.. తూముల ద్వారా పంట పొలాలకు సాగు నీరు అందించేందుకు పంట కాలువలు ఏర్పాటు చేయ లేదు. ఈ కాలువల ఏర్పాటుకు కూడా 16 ఎకరాల మేర రైతుల నుంచి కొనుగోలు చేయాల్సిన ప్పటికీ వీటిలో కూడా కొంత మేరనే కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఆయకట్టు రైతులకు నీరు అందిం చాలంటే చెరువు విస్తీర్ణం పెంచేందుకు మరో 66 ఎకరాలు కావాల్సి వస్తుందని అధికారులు చెబు తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చెరువు నిర్మాణాన్ని పూర్తి చేసి అంకితం రైతులకు చేద్దామని ఆశిద్దాం. ఈ విషయంపై మైనర్ ఇరిగేషన్ అధికారులను ఆంధ్రజ్యోతి ఫోన్ ద్వారా సంప్రదించగా.. అందు బాటులో లేరు.

పుల్లారెడ్డి చెరువును తక్షణమే పూర్తి చేయాలి



కొత్తపల్లి మండలం గోకవరం గ్రామానికి చెందిన జి.పుల్లారెడ్డి స్వగ్రామ రైతుల కోసం ఎద్దులేరు వాగుపై నిర్మించిన చెరువు నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలి. నేటికి 18 ఏళ్లయినా ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించకపోవడంతో పుల్లారెడ్డి ఆశయం నెరవేరడం లేదు. ప్రభుత్వం తక్షణమే ఇప్పటికైనా చెరువుకు పంట కాలువలు ఏర్పాటు చేసి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి.

● చిన్నపుల్లారెడ్డి, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు లింగాపురం

పేదలకు అండ సీఎం రిలీఫ్ ఫండ్


ప్రాతకోటలో బాధితులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పగిడ్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి సహాయనిధి నిరుపేదలకు అండగా నిలుస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. ఆది వారం మండల పరిధిలోని బీరవోలుకు చెందిన గోకారికి రూ.70వేలు, లక్ష్మాపురానికి చెందిన సావిత్రమ్మకు రూ.55 వేలు, ప్రాతకోటకు చెందిన భారతికి రూ.48 వేలు, బ్రహ్మానందరెడ్డికి రూ.46వేలు, పుల్లమ్మకు రూ.75వేల సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధితుల ఆరోగ్య పరి స్థితిని అడిగి తెలుసుకు న్నారు. అనంతరం ఆయన మాట్లాడు తూ గత ప్రభుత్వంలో పాలకులు పేదలకు ఇ లాంటి పథకాలను అమ లు చేయలేదన్నారు. దీం తో అనేక మంది ఇబ్బంది పడ్డారన్నారు. టీడీపీ హ యాంలో సీఎం చంద్ర బాబునాయుడు పేద ప్రజలకు అండగా నిలి చేందుకు పార్టీలకు అతీతం గా అర్హులం దరికీ పథకాలు అమలు చేసి నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, పగిడ్యాల సహకార సొసైటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, వాసురెడ్డి, శ్రీని వాసులు, డి. శ్రీనివాసులు నాయుడు, భూపిగౌడ్, షమిన్ మద్దిలేటి గౌడ్, అయ్యన్న, శేషయ్య, నాగశేషులు, బాలీశ్వరు గౌడ్, రమణ, బాబు, మహేశ్వరరెడ్డి, ఉసేన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రం చూపిన సమస్య



ఈ చిత్రంలో కనిపిస్తున్నదేదో సాదాసీదా రోడ్డు కాదండోయ్.. ఎంతో ప్రాధాన్యత కలిగిన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ప్రాజెక్టుకు వెళ్లే దారి. 80 బన్నూరు గ్రామం జాతీయ రహదారి నుంచి పోతులపాడు, చాబోలు గ్రామాల మీదుగా పోతిరెడ్డిపాడుకు రహదారి గుండా వెళ్లాల్సిందే.. దారి పొడవునా ఇలా గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● జూపాడుబంగ్లా, ఆంధ్రజ్యోతి

ఎస్పీకి అభినందనలు తెలిపిన అధికారులు



నంద్యాల టౌన్ సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా నూతన ఎస్పీగా బాధ్య తలు స్వీకరించిన సునీల్ షెరాన్‌కు ఆదివారం జిల్లా పో లీసు అధికారులు అభినం దన లు తెలిపారు. ముందు గా ఇక్క డ పని చేసిన ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మొక్కను ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం ఏఎస్పీ మందా జావళి, ఏఎస్పీ యుగంధర్ బా బు, అదనపు ఎస్పీ శ్రీనివాసులు డీఎస్పీలు, తదితరులు ప్రమోద్ కుమార్, రామాంజి నాయక్, జిల్లా సిబ్బంది, నూ తన ఎస్పీకి ఈ సందర్భంగా పుష్పగుచ్చాలు, మొక్కలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

నూతన ఎస్పీకి పూలమొక్కను అందిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

గాడిచర్ల సేవలు ప్రశంసనీయం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడిగా, పత్రికా రచయితగా, సాహితీ కారుడిగా, గ్రంధాల యోధ్యమ నాయకుడి గా గాడిచర్ల హరిసర్వోత్తమరావు తెలుగు జాతికి బహుముఖ సేవలను అందిం చారని పలువురు వక్తలు ప్రశంసించారు. ఆదివారం నంద్యాలలోని గ్రంధాలయంలో గాడిచర్ల జయంతి ఘనంగా నిర్వహించా రు. పట్టణానికి చెందిన ప్రముఖులు ఆ యన చిత్రపటానికి పూలమాల వేసి ని వాళులర్పించారు. ఈ సందర్భంగా గాడి చర్ల తెలు గుజాతికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయమూర్తి, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాసమూర్తి, సాహితీ వేత్తలు నాగరాజు, నీలకంఠమాచారి, ఎం.ఎండీ రఫీ, రోటరీ స్కూల్ కరస్పాండెంట్ డి.వి సుబ్బయ్య పాల్గొన్నారు.


గాడిచర్ల హరిసర్వోత్తమ రావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

ఉద్యమాలకు సిద్ధం కావాలి: సీపీఎం


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రణధీర్

ఆత్మకూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం నాయకులు రణధీర్, నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆత్మ కూరు పట్టణంలో డ్రైనేజీ, తాగునీరు, అంతర్గత రహదారులు, వీధిదీపాలు తదితర మౌలిక వసతుల కల్పనపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవ హరిం చడం సరికాదని అన్నారు. ఆ పార్టీ నాయకులు రామ్ నాయక్, సురేంద్ర, వీరన్న, గణపతి, చిన్న, అంబయ్య, సామేలు, రవి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, సెప్టెంబరు 14, (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం శ్రీశైలం పుణ్యక్షేత్రంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చక స్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు.

కబడ్డీ జట్ల ఎంపిక

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతీనగర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియంలో జిల్లా బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. నంద్యాల జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు చింతల మోహన్‌రావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 250 మంది బాలబాలికలు పాల్గొన్నారు. గురురాజా విద్యాసంస్థల అధినేత దస్తగిరిరెడ్డి భోజన వసతి కల్పించారు. 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేసి శిక్షణా శిబిరం నిర్వహించిన అనంతరం 14 మందిని తుది జట్టుకు ఎంపికచేస్తామన్నారు. ఎంపికైన జిల్లా జట్లు ఈనెల 22వ తేదీ నుంచి 25 వరకు ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

లోక శాంతి కోసమే కొండ ప్రార్థన

పాణ్యం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : లోక శాంతి కోసమే కొండ ప్రార్థన నిర్వహిస్తున్నట్లు ఆలమూరు సీఎస్ఐ చర్చి సంఘ కాపరి ప్రసాదు పేర్కొన్నారు. సీఎస్ఐ ఆధ్వర్యంలో ప్రతి యేటా నిర్వహించే కొండ ప్రార్థనలో భాగంగా ఆదివారం ఆలమూరు క్రైస్తవ సోదరులు కొండలోని సిలువకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆనందంతో, శాంతిసౌఖ్యాలతో జీవించాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రైస్తవ గీతాలతో, సువార్తతో యేసుక్రీస్తు గురించి తెలిపారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు విజయ్‌కాంత్, అశోక్‌కుమార్, పుష్పరాజు, ఎర్రన్న, జయదాసు తదితరులు పాల్గొన్నారు.


ఆలమూరు కొండలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

సంస్మరణ సభను విజయవంతం చేయండి

నంద్యాల రూరల్ సెసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ మాజీ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలను విజయవంత చేయాలని ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు వనజ, రామాంజ నేయులు కోరారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 17న నంద్యాలలోని నేషనల్ పీజీ కాలేజీలో, 19న డోన్‌లో సభలను నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కావున అందరూ పాల్గొని విజయ వంతం చేయాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడిగా ఆనంద్ గురూజీ

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడి గా ఖండే ఆనంద్ గురూ జీ, సభ్యులనఉ ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలో భారత్ వికాస్ పరిషత్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వ హించారు. అధ్యక్షుడిగా ఖండే ఆనంద్ గురూజీతో పాటు కార్యదర్శి కురాకు వీరాంజ నేయ ప్రసాద్, ఫైనాన్స్ సెక్రటరీ పాలూరి రాజా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా టీడీపీ యువ నాయకుడు ఎస్ఎండీ ఫిరోజ్, 12వ వార్డు కౌన్సిలర్ శ్యామ్ సుందర్‌లాల్, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌గుప్తా హాజరయ్యారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆనంద్ గురూజీ, సభ్యులు

మేరీమాత ఆలయంలో ప్రార్థనలు


ఇసుకలో మోకాళ్లతో నడుస్తున్న చంద్రశేఖర్

ప్యాపిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ నేపాల్ అల్లర్ల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న సంగతి తెలిసిందే. ఆమె క్షేమంగా మన దేశానికి రావాలని కోరుతూ మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, కోట్ల అభిమాని గుండాల చంద్రశేఖర్ నాగపట్నంలో వేలాంకిని మేరిమాతకు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కిలోమీటరు దూరం వరకు ఇసుకలో మోకాళ్లతో నడిచి మేరిమాత ఆలయానికి చేరుకుని ప్రార్థనలు చేశారు. కోట్ల సుజాతమ్మ క్షేమంగా తిరిగి రావాలని మేరీమాతకు ప్రార్థించినట్లు చంద్రశేఖర్ తెలిపారు.

ధర్మప్రచారం అందరి బాధ్యత

చాగలమర్రి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మప్రచారం అందరి బాధ్యతని పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి అన్నారు. ఆదివారం చాగలమర్రి పాత శివాలయంలో ఆయన మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, ధ్యానం, జ్ఞానం వల్లే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని అన్నారు ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడవాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, హిందూ సంఘ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అవార్డు


అవార్డుతో ఉపాధ్యాయుడు నాగరాజు

కొలిమిగుండ్ల, సెప్టెం బరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తోళ్లమడుగు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నాగరాజుకు ఇండియా ఐకానిక్ టీచర్స్-2025 అవార్డు వరించింది. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఆయనకు ఈ అవార్డు దక్కింది. గుంటూరుకు చెందిన గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ సంస్థ, రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ సంయుక్తంగా 'ఇండియా ఐకానిక్ టీచర్స్-2025' అవార్డును ప్రతి ఏటా అందజేస్తున్నారు. ఈఏడాది తోళ్లమడుగుకు చెందిన నాగ రాజుకు అందించారు. దీంతో పలువురు ఉపాధ్యాయులు నాగరాజును అభినందించారు.

రక్తదానం చేయాలి

అవుకు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : యువకులు రక్తదానం చేయాలని ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ నిర్వాహకులు షాషావలి అన్నారు. ఆదివారం మండలంలోని రామాపురం గ్రామంలో ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూపు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. గ్రూపు సభ్యులు కంబగిరిస్వామి, బాబాపక్రుద్దీన్, కైపరాజు,సురేష్, కార్తీక్ పాల్గొన్నారు.

ఘనంగా గాడిచర్ల జయంతి

సంజామల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం గ్రంథాలయాధికారి బాలతిమ్మారెడ్డి ఆధ్వర్యంలో గాడిచెర్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గ్రంథాలయాల ఏర్పాటుకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పాఠకులు మధు, అఖిల్, బీసీ హాస్టల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఆదివారం వీధి దీపాలకు సర్పంచ్ జినుగు శివరాముడు మరమ్మతు చేయించారు. గ్రామంలోని చల్లా కాలనీ, శాంతినగర్, ఎస్సీ కాలనీ, మెయిన్ బజార్ తదితర ప్రాంతాల్లో వీధి లైట్లకు మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామంలో వెలుగులు సంతరించుకున్నాయి.

సొమ్మును దోచి.. ఆశయానికి తూట్లు పొడిచి..!

- బీసీ వసతి గృహంలో అధికారుల చేతివాటం
- విద్యార్థుల సంఖ్యకు, హాజరుకు పొంతనలేని వైనం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొందరు అధికారులు సొమ్మును దోచేస్తూ ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. పేద విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన బీసీ వసతిగృహంలో అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యను అదనంగా చూపుతూ పేద విద్యార్థులకు దక్కాల్సిన ప్రభుత్వ నిధులు నొక్కేస్తున్నారు. ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది. నంద్యాల జిల్లాలోని కోవెలకుంట్ల పట్టణంలో వెనుకబడిన విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం బీసీ ప్రీ మెట్రిక్ బాలుర వసతి గృహం ఏర్పాటు చేసింది. విద్యార్థుల సంక్షేమం కోసం లక్షలాది రూపాయలు నిధులు వెచ్చిస్తోంది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు ప్రభుత్వ సొమ్మును నొక్కేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


కోవెలకుంట్ల బీసీ బాలుర వసతి గృహం

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే..

ఈ వసతిగృహంలో 119మంది విద్యార్థులు ఉన్నట్లు రిజిస్టర్‌లో ఉంది. ఇందులో సగం మంది విద్యార్థులు కూడా హాస్టల్లో అందుబాటులో లేనట్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అర్థమవుతోంది. రాత్రి సమయంలో వసతి గృహంలో కేవలం 60నుంచి 70మంది విద్యార్థులు ఉంటున్నారు. హాజరులో మాత్రం 90నుండి 105వరకు చూపుతున్నారు. హాస్టల్ సిబ్బంది పక్కనే ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలోకి వెళ్లి విద్యార్థుల ముఖ హాజరు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రతి నెలా లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్మును స్థానిక సంక్షేమ శాఖ అధికారులు నొక్కేస్తున్నట్లు సమాచారం. వసతి గృహాల్లో అవినీతిని నిరోధించ డానికి సంక్షేమ శాఖ ముఖ హాజరును అమలులోకి తీసుకవచ్చినా, అధికారులు మాత్రం తమదైన శైలిలో అవినీతికి పాల్పడుతుండటం గమనార్హం.

అనధికారికంగా వాచ్‌మన్..

సంజామల మండలం వసతి గృహంలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించే ఓ వ్యక్తి కోవెలకుంట్ల బీసీ బాలుర హాస్టల్లో అనధికారికంగా ఈతతంగాన్ని అంతా తానై నడుపుతున్నాడు. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వసతి గృహానికి ఇన్‌చార్జి వార్డెన్ కావడంతో మొత్తం వ్యవహారం సదరు వ్యక్తే నడిపిస్తున్నాడు. ఇది ఉన్నతాధికారుల ప్రమేయంతో జరుగుతుందా..? లేక కింది స్థాయి అధికారులే ఈఅవినీతికి పాల్పడుతున్నారా..? అన్నది విచారణ చేపడితే బయటపడే అవకాశం ఉంది. సదరు వాచ్‌మెన్‌కు బీసీ సంక్షేమ శాఖ అధికారుల సంఘం జిల్లా మాజీ అధ్యకుడి అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది. బీసీ వెనుబడిన విద్యార్థుల సొమ్మును మెక్కేస్తున్న అధికారుల బాగోతాన్ని ఉన్నతాధికారులు వెలికితీయాలని పలువురు తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

విచారణ జరిపి బాధ్యులపై చర్యలు

కోవెలకుంట్ల బీసీ బాలుర హాస్టల్ గతంలో నంద్యాల డివిజన్ లో ఉండేది. ఇటీవలే డోన్ డివిజన్‌లోకి మార్చారు. కోవెలకుంట్ల బీసీ హాస్టల్లో జరుగుతున్న అవినీతి తన దృష్టికి రాలేదు. త్వరలోనే దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- ఓబులేసు, సంక్షేమ శాఖ సహాయ అధికారి, డోన్

నాపరాళ్లు తొలగింపు


రోడ్డుపై వేసిన నాపరాళ్లను ట్రాక్టర్‌లో వేస్తున్న కూలీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అవుకు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని కుమ్మరిదిడ్డి వీధిలో రోడ్డుకు అడ్డుగా వేసిన నాపరాళ్లు ఎట్టకేలకు తొలగించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి' 'గోడలు తెచ్చిన గొడవ' అనే కథనాన్ని ప్రచురించింది. విషయం రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. దాంతో మంత్రి ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి పోలీస్, పంచాయతీ అధికారులు ఆఘమేఘాలపై కూలీలతో నడిరోడ్డుపై అడ్డంగా వేసిన నాపరాళ్లను ట్రాక్టరుతో తొలగించారు. కుమ్మరిదిడ్డి వీధిలో రెండు కుటుంబాల పోరు కాలనీ ప్రజలకు బేజారుగా మారింది. నాలుగు కూడళ్ల రహదారి ఆక్రమణకు గురవతున్నట్లు కాలనీ ప్రజలు అధికారులకు విన్నవించుకున్న ఆరు నెలలుగా పరిష్కారం కాలేదు. మంత్రి బీసీ ఆదేశాలతో అధికారులు స్పందించారు. ముందుగా రోడ్డుకు అడ్డంగా ఉన్న రాళ్లను తొలగించారు. నేడు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారుల సమక్షంలో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ ఈవో హరిప్రసాద్ తెలిపారు. కాలనీవాసులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

30లోగా దరఖాస్తు చేసుకోవాలి

చాగలమర్రి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే పేదవిద్యార్థులు ఉపకార వేతనం పొందడానికి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్‌స్కాలర్‌షిప్ పొందడానికి ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఎంఈవో న్యామతుల్ల తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాల ల్లో చదివే విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందని అన్నారు. సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మూడో రోజూ అంతరాయమే


ట్రాక్టరుపై వాగు దాటుతున్న మహిళ

సంజామల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పాలేరువాగు ఉప్పొంగడంతో వాహనాలు రాకపోకలకు అంతరాయం కలిగింది. మూడవ రోజూ వాగు శాంతించకపోవడంతో ఆర్టీసీ బస్సులు నడపలేదు. కోవెలకుంట్ల నుంచి అవుకు మీదుగా తాడిపత్రి, అనంతపురం, కోవెలకుంట్ల నుంచి సంజామల మీదుగా తాడిపత్రికి వెళ్లే ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాగును దాటేందుకు ట్రాక్టర్లపై ప్రయాణికులను దాటించారు. ఆటోలు నడవకపోవడంతో ప్రయాణికులు చుట్టూ తిరిగి కోవెలకుంట్ల, బనగానపల్లెకు వెళ్లి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి చోటు చేసుకుంది. ఆరేళ్లగా వాగు ఉధృతి ఇలా రాలేదని ప్రజలు పేర్కొంటు న్నారు. పరివాహక ప్రాంతంలో 1500 ఎకరాలు సాగైన వరిపంట వరద ముంపునకు గురైంది. మూడు రోజుల పాటు వరద నీటిలో ఉండడంతో కుళ్లిపోయి అపారనష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. వరిమడులు వరద నీటితో చెరువులను తలపించేలా ఉన్నాయి.

టెండర్ల కాలపరిమితిలో మార్పు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన అహోబిలం లక్ష్మీ నరసింహ దేవస్థానంలో వేలాల కాల పరిమితిలో మార్పు చేసినట్లు ఆలయ సీవోవో(చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్) సౌందర్యరాజన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవర ణలో టెంకాయల విక్రయానికి, కొబ్బెరిచిప్పల సేకరణకు సంబంధించి 19-9-2025 ఒక సంవత్సరం కాలపరిమితికి 4-10-2025 నుంచి 03-10-2026 వరకు సీల్ టెండర్ల ఆహ్వానించామని, దాన్ని 05-10-2025 నుంచి 4-10-2026 వరకు మార్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని టెండర్ దారులు గమనించాలని ఆయన కోరారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

బేతంచెర్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో రౌడీషీటర్లు అల్లర్లకు ఘర్షణలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆయా గ్రామాల రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ నేరాలకు దూరంగా ఉంటూ ప్రజలతో కలిసిమెలిసి జీవించాలన్నారు. కౌన్సిలింగ్‌లో బేతంచెర్ల ఎస్ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లింగమయ్యకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పద్మశాలి సత్రం అభివృద్ధికి కృషి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం, సత్రం అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడు పద్మనాభుడు అన్నారు. ఆదివారం అహోబిలం క్షేత్రంలో పద్మశాలి సంఘం సమావేశం నిర్వహించారు. అఖిలభారత పద్మశాలి సత్రం నూతన అధ్యక్షుడుగా ఎర్రనాగు పద్మనాభుడు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. కార్యక్రమంలో న్యాయవాది నీలకఠం, మాజీ అధ్యక్షురాలు విజయలక్ష్మి, న్యాయవాది సేపూరి మద్దిలేటి, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు రంగ పినాక పాణి, మాజీ ప్రధాన కార్యదర్శి రామయ్య పాల్గొన్నారు.

గని గుంతలో మృతదేహం లభ్యం

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గనిగుంతలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గేదెలను మెపుకోవడానికి గని గుంత సమీపంలోకి వెళ్లాడు. గనిగుంతలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. టౌన్ ఎస్ఐ జయప్ప సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతదేహాన్ని బయటికి తీయలేదని సోమవారం బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహిస్తామన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు ఏమి తెలియరాలేదని వివరించారు.

లభించని వృద్ధురాలి ఆచూకీ

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపనగుడి గ్రామ కుందూనది వంతెన సమీపంలో శనివారం గల్లంతైన వృద్ధురాలు పూల ఫకూర్‌బీ ఆచూకీ లభించలేదని తహసీల్దారు ప్రసాద్‌బాబు తెలిపారు. ఆదివారం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కుందూ నదిలో గాలింపు చర్యలు చేపట్టాయన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు కడప జిల్లా పెద్దముడియం మండలం పాలూరు వరకు గాలించినా ఆచూకి లభించలేదన్నారు. సోమవారం తిరిగి గాలింపు చర్యలును ముమ్మరం చేస్తామని ఆయన తెలిపారు.

జోరుగా మిరప నాట్లు


మిరప నారు నాటుతున్న కూలీలు

సంజామల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు మిరప, పొగాకు నాట్లు వేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో నాట్లు వేస్తున్నట్లు రైతులు తెలిపారు. రెండేళ్ల నుంచి మిరప, పొగాకు గిట్టుబాటు ధరలు లేకపోయినా నష్టాలు వచ్చినా ఈ ఏడాది అయినా కష్టాల కడలి నుంచి గట్టెక్కుతామన్న ఆశతో నాట్లు వేస్తున్నారు.

వాల్మీకి గుహల సందర్శన

ప్యాపిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాల్మీకి గుహల దగ్గర కర్ణాటక రాష్ట్రానికి చెందిన పర్యాటకులు సందడి చేశారు. గుహల్లో సహజ సిద్ధంగా వెలసిన ఆకృతులు, వివిధ రూపాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని కితాబు ఇచ్చారు. బెంగుళూరు వివిధ ప్రాంతాలను నుంచి వచ్చినట్లు పర్యాటకులు తెలిపారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మండల పూజలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం మండల పూజలు వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాలు ముగిసి 40రోజులు పూర్తికావడంతో మండల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణం, విశేష అభిషేకాలు, నూతన వస్త్రాల అలంకరణ, భక్తులకు అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

చౌడేశ్వరీదేవికి పూజలు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంతపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ఆయన దేవాలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ప్యాపిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరాం విమర్శించారు. ఆదివారం పట్టణంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సీఐటీయూ మహా సభలను నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, చిన్నరహిమాన్, లక్ష్మణ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రహదారి నిర్మాణ పనులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రం నుంచి పేట్నీకోటకు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కొన్నేళ్లగా కొలిమిగుండ్ల, పేట్నీకోట రహదారి గుంతలమయంగా మారింది. పలు గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం నాబార్డు కింద రూ.2కోట్లు నిధులు మంజూరు చేయడంతో పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు రహదారి నిర్మాణంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇటిక్యాల వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొట్టింది. ఆదివారం జమ్మలమడుగు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తాడిపత్రికి వెళ్తూ ఇటిక్యాల గ్రామ స్టేజీ వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు నిలిచింది. ఇదే సమయంలో వెనుక నుంచి ఓ లారీ బస్సును ఢీకొట్టింది. బస్సు ముందుకు కదలడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈఘటనలో లారీ ముందు భాగం దెబ్బతిన్నది. బస్సు డ్రైవరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శరన్నవరాత్రుల పుస్తకాల ఆవిష్కరణ

చాగలమర్రి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పుస్తకాలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణబాబు, కార్యదర్శి వరప్రసాద్, ఉపాధ్యక్షులు మల్లికార్జున, సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పుస్తకాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి అక్టోబరు 4 వరకు దసరా ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఆర్యవైశ్యులు జ్వాలా, వెంకటేశ్వరబాబు, చం ద్రశేఖర్, బాబు, నాగేంద్రగుప్త, పృథ్వినాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో (అమ్మవారిశాల)లో నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రులను ఆర్యవైశ్యులు విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు గుండా గోపాల్ కోరారు. ఆదివారం పట్టణంలోని అమ్మవారిశాలలో శరన్నవరాత్రుల పత్రికలను ఆర్యవైశ్యులు విడుదల చేశారు. కార్యక్రమంలో బచ్చు సుబ్రహ్మణ్యం, గుండా జగన్మోహన్ రావు, రామ్మూర్తి, మాణిక్యంశెట్టి, గుప్త, శ్రీధర్, హరి, సురేష్‌బాబు, భాస్కరయ్య పాల్గొన్నారు.

చిన్నకోనేరు శుభ్రం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుద్దేటివీధి మూలమ్మ గుడి వద్ద ఉన్న చిన్న కోనేరును కాలనీవాసులు శుభ్రం చేసినట్లు ఈవోఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని చిన్న కోనేరు బావి కొంతకాలంగా అపరిశుభ్రంగా ఉండేది. చెత్తాచెదారం పేరుకుపోయింది. బావినిశుభ్రం చేయించాలని కాలనీకి చెందిన టీడీపీ నాయకులు ఈవోఆర్‌డీకి వినతిపత్రం అందించారు. కాలనీకి చెందిన కొత్తమిద్దె వెంకటసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగేశ్, చందు, మద్దిలేటి, మోహన్‌రెడ్డి, పెద్దారెడ్డి, కాంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాండు రంగస్వామి ఆలయ కమిటీ చైర్మన్ చిన్నవెంకటసుబ్బారెడ్డి అలియాస్ గుండయ్య పాల్గొని చిన్నకోనేరులో చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం చెత్తను ట్రాక్టరులో తలించారు. బావి చుట్టూ పెద్దరాతి బండలు వేయించాలని ఈవోఆర్‌డీని గ్రామస్థులు కోరారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకంబలూరు, యల్లావత్తుల, రుద్రవరం, కొండమాయపల్లె గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు మహిళా భక్తులు బోనాలు, చీరలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

విగ్రహాల పరిశీలన

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదా శిల్ప కళామందిరంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే భైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను పరిశీలించారు. శిల్పకళా మందిరం వ్యవస్థాపకుడు దురుగడ్డ రవీంద్రాచారి, శిల్పి దురుగడ్డ భువనేశ్వరీ దేవతామూర్తుల విగ్రహాలను చూపారు. తాను నూ తనంగా నిర్మించనున్న ఇంటిలో ఏర్పాటు చేసేందు కు విగ్రహాలు తయారు చేసి ఇవ్వాలని కోరారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యుడు హరి చరణ్ రెడ్డి తెలిపారు. ఆదివారం వైద్యుడు మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్బీఎస్‌కే)లో భాగంగా ప్రతి విద్యార్థికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది ప్రతి పాఠశాలలకు వెళ్లి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్య సేవలు అంది స్తున్నారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

సండే సందడి..

- చిన్నారులకు ప్రయోజనకరంగా మారిన పోలీస్ క్రికెట్ నెట్


క్రికెట్ ఆడుతున్న చిన్నారులు, యువకులు

డోన్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయం ప్రాంగణంలో డీఎస్పీ శ్రీనివాసులు పోలీసుల కోసం క్రికెట్ నెట్ ఏర్పాటు చేయించారు. అది చిన్నారులకు, యువకులకు ప్రయోజనకరంగా మారింది. శని, ఆదివారం రెండు రోజులు సెలవులు రావడంతో విద్యార్థులు, యువకులు పోలీస్ క్రికెట్ నెట్ వద్ద క్రికెట్ ఆడుతూ సందడి చేశారు. మైదానం మొత్తం ఓ వైపు చిన్నారులు, మరో వైపు యువకులు క్రికెట్ ఆడుతూ ఉత్సాహంగా గడిపారు.